క్లుప్తంగా

నేడు శృంగేరి శారదాపీఠాధిపతి రాక

దర్శి (కురిచేడు): శృంగేరి శారదాపీఠాధిపతి భారతి మహాస్వామి మంగళవారం సాయంత్రం 5 గంటలకు దర్శి వస్తున్నట్లు శృంగేరి శారదాపీఠం భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది. జగద్గురువుల ఉత్సవం దర్శి గడియార స్తంభం నుంచి పూర్ణకుంభ స్వాగతంతో వేదపండితులు, వేదగోష్ఠితో పురజనుల శారదేపాహిమాం, శంకరే దక్షణాం.. అను నామ సంకీర్తనతో ఉత్సవం ప్రారంభమై పొట్టి శ్రీరాములు బజారు నుంచి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు ఉత్సవం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు జగద్గురువుల ఆశీర్వచనం జరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం పురాతన రామాలయం, సువర్చలా సమేత ప్రసన్నాంజ నేయస్వామి, వాసవి కన్యకాపరమేశ్వరిలను దర్శించుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు.

అంకాలమ్మ తల్లికి పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ఆదివారం రాత్రి గ్రామ దేవత అంకాలమ్మతల్లి ఉత్సవం ఘనంగా నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించి మొక్కులు చెల్లించారు. కుంకుమ బండ్లు కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని వేడుకున్నారు.

22న హనుమాన్ జయంత్యుత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియో బావి వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలకృష్ణారెడ్డి, యర్రారెడ్డి, పెండ్యాల కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ రాత్రి ఆలయం వద్ద భరతనాట్యం, కూచిపూడి సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు లక్కీడ్రా ద్వారా పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైవే రోడ్డు నుంచి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఆలయ ఆవరణలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

మార్కాపురం టౌన్: విశ్వ హిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో మార్కాపురంలో ఈనెల 22వ తేదీ గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయ స్వామిగుడి నుంచి శోభయాత్ర ప్రారంభమై పుర వీధుల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఊరేగింపు అనంతరం చెన్నకేశవగుడి వద్ద అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందువులందరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

25న ఉద్యోగుల సంఘ ఎన్నికలు

అర్ధవీడు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కంభం తాలుకా ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు ఈ నెల 25న స్థానిక పెన్షనర్ల భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల్లో పని చేసే అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వరకుమార్, మార్కాపురం తాలూకా అధ్యక్షుడు చెంచిరెడ్డి, కనిగిరి తాలూకా అధ్యక్షుడు రమేష్‌బాబు ఎన్నికలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనే వారు తమ వివరాలను ట్రెజరీ ఉద్యోగి రంగయ్య, అటవీ శాఖ ఉద్యోగి ముక్కు ప్రసాద్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

21 నుంచి వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలో వేమయ్యస్వామి 263వ ఆరాధన మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు కలశ గ్రామోత్సవం, 22వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు గణపతి పూజ, అభిషేకం, అఖండస్థాపన, అంకురార్పణ, మండల ఆవాహం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి కోలాట బృందంతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో వేమయ్యస్వామి

గడ్డికి గడ్డుకాలం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎండుగడ్డి



మేత లేక బీడు భూముల్లో పశువులు

- ఎండుగడ్డి కొరతతో ఇబ్బందులు
- పశుగ్రాసం పథకాలు మరిచిన ప్రభుత్వం
- భారమైన పశుపోషణ

పుల్లలచెరువు: ఎండాకాలం వచ్చిందంటే పచ్చిగడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశుపోషణ గడ్డిపైనే ఆధారపడి ఉంటుంది. గతంలో ఎండుగడ్డికి లోటు ఉండేది కాదు. కొనేళ్లుగా వ్యవసాయం యాంత్రీకరణ పెరగడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. మూగజీవాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీన్ని అధిగమించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఫలితంగా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కొన్నేళ్లుగా కూలీల ఖర్చులు విపరీతంగా పెరగడంతో రైతులు యంత్రాలతో వరి కోతలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో తరుచూ వస్తున్న మార్పులతో పంటను హడావుడిగా యంత్రాలతో కోతలు కోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కూలీలతో పోలిస్తే యంత్రాలతో కోతలతో ఖర్చు, సమయం ఆదా అవుతోంది. కూలీలతో కోతలు కోయిస్తే పశువులకు అవసరమైన ఎండు గడ్డి పెద్ద మొత్తంలో లభిస్తుంది. అదే యంత్రాలతో కోతలు చేస్తే పొలాల్లో నాణ్యమైన ఎండుగడ్డి రావడం లేదు. యంత్రాలతో కోతలు కోయడంతో సగం గడ్డి మొదట్లోనే ఉండిపోతోంది. మిగిలిన సగం నలిగిపోయి పశువులు తినేందుకు పనికి రాకుండాపోతోంది. దీనికి తోడు వరి పంటలు వేసే పొలాల్లో రియల్ ఎస్టేట్, పండ్ల తోటలు వైపు రైతులు మొగ్గు చూపడంతో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది.

పశుగ్రాసం పథకాలు ఎక్కడ?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కనిష్టంగా 25 సెంట్లు, గరిష్టంగా 2.5 ఎకరాలు సొంత భూమి కలిగి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంపకానికి చేయూతనిచ్చేవారు. సైలేజ్ గడ్డి, టీఎంఆర్ దాణా, పశుగ్రాసం పెంచుకునేందుకు విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించేవారు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి కొరత అనిపించేది కాదని పశుపోషకులు పేర్కొంటున్నారు. ఈ ప్రభుత్వంలో పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదంటున్నారు. ఈ ఏడాది ఇప్పడే పశుగ్రాసం కొరత రైతులను వెంటాడుతోంది.

పెరిగిన ధరలు

కేవలం కూలీలతో కోతలు కోసిన గడ్డి మాత్రమే పశువులకు పనికి వస్తుండటంతో అదీ అతి తక్కువగా మాత్రమే అందుబాటులో ఉండటంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.12 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో పశువులకు మేత దొరకడం కష్టంగా మారిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుగడ్డి దొరకడం లేదు:



మాకు పది పాడి గేదెలు ఉన్నాయి. వాటి కోసం గడ్డిని కొనలేక పోతున్నాం. ఎండు గడ్డి కట్ట రూ.150 చెబుతున్నారు. గతంలో మనుషులతో కోసిన గడ్డిని కాలువ ఏరియా ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. గడ్డికి చాలా ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ఎండలు ముదరడంతో పచ్చిగడ్డి దొరికే పరిస్థితి లేదు. ఎండుగడ్డి దొరక్క పశుపోషణ కష్టంగా మారింది. – చిన్నా, పాడిరైతు, పుల్లలచెరువు

డీఈఓ కార్యాలయం ముట్టడి విజయవంతం చేయండి



ఐక్యత చాటుతున్న ఐక్యవేదిక నాయకులు

దర్శి (కురిచేడు): ఉపాధ్యాయ ఐక్య సంఘాల వేదిక పిలుపు మేరకు ఈ నెల 21వ తేదీ పాఠశాలల పరిరక్షణ కోసం డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఫౌండేషన్ పాఠశాలల రూపురేఖలు మార్చాలని, తెలుగు, ఇంగ్లిష్ మీడియం సమాంతరంగా కొనసాగించాలని, 120 రోలు వద్ద మరొక ఎస్జీటీని కేటాయించాలని, ఉన్నత పాఠశాలల్లో 45 రోలు వద్ద రెండో సెక్షన్ మంజూరు చేయాలని, మరీ ముఖ్యంగా వెబ్ కౌన్సిలింగ్‌ను నిలుపుదల చేస్తూ మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని కోరుతూ విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను పిలుపునిచ్చారు. బుర్రి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకల్లా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ కార్యదర్శులు కాటిపల్లి వెంకటేశ్వర్లు, బొప్పూడి విక్రమ్‌నాగార్జున, వివిధ మండలాల బాధ్యులు అట్లూరి రామారావు, బైరెడ్డి రంగారావు, తిప్పిశెట్టి శ్రీనివాసరావు, రంగస్వామి, బాలనాయక్, శ్రీనివాసరావు, కారంకి నాగరాజు, పి. కాశీం, ఎం.ఎలమందారెడ్డి, జి.వేణు, షేక్ మస్తాన్‌వలి, వేమా రమణయ్య, వి. చక్రధర్ పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

దర్శి (కురిచేడు): స్థానిక పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పాదిలి పెద్దిరాజు తెలిపారు. జాబ్‌మేళాలో 15 జాతీయ కంపెనీలు పాల్గొంటాయని, జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు చదివి 19–28 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, విజయవాడ, ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపీకృష్ణ 88979 64505, 911070 2319 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

డీప్‌బోర్ సౌకర్యం కల్పించాలి

దొనకొండ: వద్దిపాడు పంచాయతీ పరిధి కలివెలపల్లి గ్రామానికి డీప్‌బోర్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ నూనె సరోజా వెంకటరెడ్డి అధికారులను కోరారు. తమ గ్రామానికి డీప్‌బోర్ సౌకర్యం లేక పొలానికి వెళ్లిన పశువులు నీటికి ఇబ్బంది పడుతున్నాయని సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినట్లు ఆమె వివరించారు. తమ గ్రామంలో పశువులు ఎక్కువగా ఉన్నాయని, వాటి మీదనే ప్రజలు జీవనం సాగిస్తున్నారని, గేదెలకు నీరు లేక పశుకాపరులు సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు.సర్పంచ్ నైనా డీప్‌బోర్ సౌకర్యం కల్పించలేకపోతున్నానని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామ పొలాల్లో డీప్‌బోర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు.

స్పందనకు తప్పని సరిగా హాజరు కావాలి

పుల్లలచెరువు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలో జరిగే స్పందనకు తప్పని సరిగా అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, లేకుంటే సమాచారం చేరవేయాలన్నారు. కింది స్థాయి సిబ్బందిని పంపే అలవాటు మానుకోవాలని చెప్పారు. స్పందనలో పాల్గొన్న శాఖల అధికారులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో కలెక్టర్ కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. అధికారులు గమనించి స్పందన కార్యక్రమానికి తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పచ్చిరొట్ట ఎరువు సాగు సమయం ఇదే..



పెదన్నపాలెంలో రైతుకు విత్తనాలు అందిస్తున్న ఏఓ

దొనకొండ: ఈ ఏడాది సకాలంలో రుతు పవనాలు రావటం.. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలం దుక్కులు చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయాల్సిన సమయం ఇదేనని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు జనుములు, పిల్లిపెసర, జీలుగ 50 శాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం మండలానికి ఈ ఏడాది జీలుగలు 3 క్వింటాళ్లు, మినుమలు 7 క్వింటాళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

పచ్చిరొట్టతో ప్రయోజనాలు

పచ్చిరొట్టతో భూమి గుల్లగా మారి నీరి ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవ రసాయనిక చర్య జరుగుతుందని ఏఓ వివరించారు. దీంతో నేల సారం పెరుగుతుంది. ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుంది. భూమిలో అందుబాటులోని చాలా రకాల పోషకాలు ఉపయోగపడతాయి. ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యతను భూమిలోని సూక్ష్మజీవులు పెంచుతాయి. పుష్ప జాతి పంటలతో రైజోబియం బ్యాక్టీరియా పెరగటం, ఎకరానికి 20 నుంచి 50 కేజీల నత్రజని లభ్యమవుతుంది. దీంతో ఎరువులు తగ్గించుకోవచ్చు. కలుపు మొక్కలు పెరగకుండా కాపాడుతాయి. భూమి లోతులో ఉన్న పోషకాలను ఉపరితలానికి తీసుకొచ్చి పంట మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయి. పశువుల మేతకు ఉపయోగపడతాయి. జీలుగల పంటను చౌడు భూముల్లో వేస్తారు. ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాన్ని ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకోవాలి. 50 శాతం పూత దశకు వచ్చాక భూమిని కలియదున్నితే ఎకరానికి 9 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభ్యమవుతుంది. జనుమును అన్ని నేలల్లో పెంచవచ్చు. దీన్ని పశువుల మేతగా వాడుకోవచ్చు. వీటన్నింటినీ 8 కేజీల విత్తనాలు వేస్తే 5–6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. పెసర, మినుము పంటలు వేస్తే పశుగ్రాసంతో పాటు భారీగా పచ్చిరొట్ట లభిస్తుంది. గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ నంబర్ తీసుకుని వచ్చి విత్తనాలు పొందవచ్చని ఏఓ లక్ష్మీనారాయణ గ్రామాల్లోని రైతులకు తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



మహాసభలో మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

దర్శి (కురిచేడు): దర్శిలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్యదర్శి ఎంఎల్ నారాయణ కోరారు. స్థానిక ప్రశాంత స్కూల్ ఆడిటోరియంలో సోమవారం దర్శి నియోజకవర్గ 6వ మహాసభలు జరిగాయి. మహాసభల సందర్భంగా సీపీఐ జెండాను సీనియర్ నాయకులు చెన్నెబోయిన లక్ష్మీదేవి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజలు అనేక సమస్యలతో అల్లాడుతున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ కులాల మధ్య, మతాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ బీజేపీకి తొత్తుగా మారి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఆగస్టులో జరుగుతాయని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్రబాబు తెలిపారు. రాష్ట్ర , జిల్లా సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ రూపకల్పన దర్శిలో జరిగే జిల్లా మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభల్లో సీపీఐ సీనియర్ నాయకుడు బి. వీరాంజనేయులు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, కె.హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి, బీకేఎంయూ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, సుంకర అంజిరెడ్డి, గురుమూర్తి, బాలయ్య, వెలుగోటి వెంకటేశ్వర్లు, కల్లూరు పెద్ద అంజనేయులు, ఎస్.రామాంజి యాదవ్, సీహెచ్ అరుణ, అంజమ్మ, సింగరకొండ శ్రీను పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తాళ్లూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు 12 మంది గైర్హాజరయ్యారు. మండల కేంద్రం తాళ్లూరు వీకే ప్రభుత్వం పాఠశాల, సరస్వతి హైస్కూల్లోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–1 సుబ్బయ్య, ఎంఈఓ–2 సుధాకర్‌రావు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు పర్యవేక్షించారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న లబ్ధిదారుడు

ముండ్లమూరు (కురిచేడు): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. రెండు అర్జీలు పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరు కోసం, మరొకటి నివాస స్థలం మంజూరు కోసం వచ్చినట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, మండల సర్వేయర్ సీహెచ్ కోటంరాజు, ఎంఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వాటుపల్లి కృష్ణప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



బాలిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని తెల్లబాడు పంచాయతీ సర్పంచ్ యామన బాలిరెడ్డి ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పాదిలిలో పని ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా తెల్లబాడు సమీపంలో చప్టా వద్ద పొగాకు బేళ్లతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డోర్ తగలటంతో బాలిరెడ్డి కింద పడి కుడి కాలికి తీవ్ర గాయమైంది. ఆయన్ను కుటుంబ సభ్యులు, బంధువులు పొదిలి ఉడుముల ఆస్పత్రిలో చేర్పారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైద్యశాలకు వెళ్లి సర్పంచ్ బాలిరెడ్డిని పరామర్శించి తానున్నానంటూ భరోసా కల్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జిల్లా యాక్టివ్ సెక్రటరీ బత్తుల సుబ్బయ్య యాదవ్, తమ్మినేని సుబ్బారెడ్డి, విప్పర్ల చిన్న మల్లయ్య, ఐలూరి శ్రీనివాసరెడ్డి, వడ్లమూడి బుజ్జి, రామ సత్యం, యామన బ్రహ్మారెడ్డి ఉన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఈ ఏర్వ నాగేంద్రారెడ్డి

పెద్దారవీడు: ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ ఏర్వ నాగేంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకలతో మాట్లాడారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటి అవసరాల కోసం సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని, ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోందని పేర్కొన్నారు. కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లు ఏర్పాటు చేసుకుంటే రూ.60 వేలు, మూడు కిలో వాట్‌లకు రూ.78 వేలు రాయితీ ఇస్తారని, పూర్తి వివరాల కోసం విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



బార్ అసోసియేషన్ నూతన కమిటీ

దర్శి (కురిచేడు): దర్శి బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. బార్ అసోసియేషన్ హాలులో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లెపోగు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కిలారి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నల్లపు సుబ్బారెడ్డి, కోశాధికారిగా పందుల మనోహరమ్మ, మహిళా కార్యదర్శిగా ఇజ్జగిరి శాంతి, సంయుక్త కార్యదర్శిగా మారెడ్డి లక్ష్మీనారాయణ, లైబ్రేరియన్‌గా నీలిశెట్టి శ్రీనులు ఒక్కో నామినేషన్ దాఖలు చేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వీరపనేని రంగా, జీటీ శివశర్మ, యర్రంశెట్టి రాజశేఖర్, ఎంవీఎల్ నరిసింహారావు, గువ్వల శ్రీనివాసరెడ్డి ఎంపిక చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పుల్లలచెరువు: మండలంలోని రంగన్నపాలెం, చాపలమడుగు గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగీవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రచార సేవా సమితి అధ్యక్షుడు ఏడుకొండలు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మహాభారత కాలంలో తాను ఆచరించి ప్రవచించిన భగవద్గీత త్రైత సిద్ధాంతానికి ఆయువు పట్టుగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కృష్ణుడు చూపిన మంచి మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, బాలరంగయ్య, నవీన్, సరస్వతి, కొండమ్మ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



పోలీసుస్టేషన్‌లో ప్రేమజంట

దొనకొండ: ఓ ప్రేమజంట తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మురికిపూడి దావీదు, యద్దనపూడి రోజా నాలుగేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. 15 రోజుల క్రితం పెద్దారవీడు మండలం తోకపల్లి ఎస్సీ కాలనీకి చెందిన యువతితో దావీదుకు తల్లిదండ్రుల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. ఆ సమయంలో ప్రేమికురాలు రోజా మౌనం పాటించింది. రెండు రోజుల నుంచి దావీదు అమ్మాయి ఇంటికి వెళ్తున్నాడు. అది చూసిన యువతి తల్లిదండ్రులు గొడవకు దిగి తమ అమ్మాయి వద్దకు రావద్దని హెచ్చరించారు. వెంటనే ప్రేమికులు తాము మేజర్‌లమని, వివాహం చేసుకుంటామని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్‌ఐ ఇద్దరి తల్లిదండ్రులను పిలిపించి పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి



గేదె కళేబరం

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి గ్రామానికి చెందిన చేతుల వెంకటేశ్వర్లు గేదె సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగులుకొని విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం మేత కోసం వెళ్తున్న సమయంలో గ్రామంలోని చెరువు కట్ట వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు చెప్పాడు. వెంటనే స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి అదుకోవాలని గేదె యజమాని కోరుతున్నాడు. విద్యుత్ సరఫరా నిలిపి వేసినా కరెంట్ సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి సెలవులు కావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గర చెరువులో పిల్లలు క్రికెట్ అడుతుంటారని స్థానికులు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కరెంట్ సరఫరా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.